# శత్రువు

-ఆకునూరి మురళీకృష్ణ

"ఎలా ఉందిట సినిమా? టాక్ ఎలా వుంది?'' అసహనంగా అడిగాడు రామచంద్రం.

అతనలా అడగడం అది ఆరోసారి.

దాదాపు ఆరోజు తన షూటింగ్ షెడ్యూల్ అంతా క్యాన్సిల్ చేసుకుని అదే పనిలో ఉన్నాడు రామచంద్రం.

అతన్నలా చూస్తుంటే అసిస్టెంట్లకి వింతగా ఉంది.

దాదాపు ఒక దశాబ్దంపాటు ఏకధాటిగా తెలుగు ప్రేక్షకులని ఉర్రూతలూగించిన దర్శకుడు అతను. అతను ఆ చిన్న సినిమా గురించి అలా టెన్షన్ పడడం చూసే వాళ్లకి విచిత్రంగానే వుంటుంది. కానీ అతనికీ శరత్‌కీ మధ్యనున్న శత్రుత్వాన్ని గురించి తెలిసిన వాళ్లెవ్వరూ అలా అనుకోలేరు.

"ఓపెనింగ్స్ చాలా డల్‌గా ఉన్నాయంట సార్. టాక్ కూడా పెద్ద తృప్తికరంగా లేదు. ఈ సినిమాతో శరత్ ఇంటికెళ్లిపోవడం ఖాయమంటున్నారంతా''

రామచంద్రం ముఖంలో చిరునవ్వు చోటు చేసుకుంది. కుర్చీలో రిలాక్సవుతూ వెనక్కు వాలాడు.

సెల్‌ఫోన్ తీసి ఏవో నెంబర్లు నొక్కాడు.

మళ్లీ అదే ప్రశ్న "ఎలా ఉందిట సినిమా?''

అటునుంచి వచ్చిన సమాధానం విని సంతృప్తిగా నవ్వుకున్నాడు.

కుర్చీలోంచి లేచి ఆఫీస్ రూమ్‌లో పచార్లు చేయసాగాడు.

ఆనందంతో అతనికి కాలు నిలవడంలేదు.

ఇంకో రెండు మూడు చోట్లకి ఫోన్ చేసి విషయం కనుక్కున్నాడు.

అందరూ అదే మాట...సినిమా చూసినవాళ్లంతా ఏ కామెంట్లు చేయకుండా ఇంటికి వెళ్లిపోతున్నారట. ఆట ఆటకీ జనం తగ్గుతున్నారు. ఇలాగే కంటిన్యూ అయితే వారం తిరక్కుండానే బాక్సులు వెనక్కి రావడం ఖాయం. తనకి కావాల్సింది అదే.

శరత్ సినిమా పరాజయం పొందాలి.

తన సినిమా విజయం సాధించాలి.

శరత్ ఓడిపోవాలి...తను గెలవాలి.

ఇప్పుడు వినిపిస్తున్న ఈ టాక్ అతనికి చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తోంది.

గబగబా వెళ్లి కుర్చీలో కూర్చుని తెల్ల కాగితాలు పెన్నూ తీసుకున్నాడు.

మర్నాడు తీయాల్సిన సీన్ అతని మనోఫలకం మీద కదలాడింది.

మరొక్కక్షణం ఆలోచించి తల పంకించాడు.

కళ్లు తెరిచి గబగబా రాయడం మొదలుపెట్టాడు.

దాదాపు గంటసేపు ఒంచిన తల ఎత్తకుండా అలా రాస్తూనే ఉన్నాడు ఏదో ట్రాన్స్‌లో వున్నవాడిలా.

షాట్ డివిజన్, కెమెరా యాంగిల్స్‌తోసహా సన్నివేశం మొత్తం పూర్తయిపోయింది.

అసిస్టెంట్‌కిచ్చాడు చదవమని.

చదివాక ఆశ్చర్యానందాలతో తలెత్తాడు అతను.

"అద్భుతం. ఇవాళ ఇండస్ట్రీలో ఏ డైరెక్టరూ ఇంత గొప్పగా సీన్ రాయలేడు. నిజంగా అద్భుతం సార్'' అన్నాడతను.

రామచంద్రం అతని మాటల్ని పట్టించుకోలేదు. అతని మనసు ఆనంద డోలికల్లో తేలిపోతోంది.

తన మొదటి సినిమా విజయవంతమై ప్రేక్షకులు తనకి బ్రహ్మరథం పట్టినప్పుడు కూడా అతనింతగా సంతోషపడలేదు.

ఈ ఓటమిని శరత్ ఎలా తట్టుకోగలడు?

అంతకుమించిన దెబ్బ అతనికి తను ఇవ్వబోయే హిట్!

తన సినిమాని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలి. అనుకున్నదానికంటే బాగా తీయాలి. ఉత్సాహంగా ప్రణాళికలు వేసుకున్నాడు.

తన క్లోజ్ ఫ్రెండ్స్ సర్కిల్‌కి ఫోన్ చేసాడు.

"ఇవ్వాళ రాత్రి మా గెస్ట్‌హౌస్‌లో పార్టీ వుంది''

"ఏమిటి విశేషం? ఏమైనా కొత్త ప్రాజెక్టు చేపట్టావా? లేక...' అంటూ ఆగిపోయారు కొందరు.

"తెలిసీ ఎందుకడుగుతారు? అందుకే...'' నవ్వుతూ అన్నాడు రామచంద్రం.

***

ఆ తరువాత రామచంద్రం ఒక వారంరోజుల పాటు మునుపెన్నడూ లేనంత ఉత్సాహంగా పని చేసాడు.

అతనంత ఏకాగ్రతతో పనిచేయడం ఈ మధ్య కాలంలో ఎవరూ చూడలేదు.

అతను తీసే విధానం చూస్తుండగానే తెలిసిపోతోంది ఈ సినిమా అఖండ విజయం సాధించడం ఖాయమని!

కానీ సరిగ్గా వారంరోజుల తరువాత అతనికి అనుకోని ఎదురుదెబ్బ తగిలింది.

అప్పటిదాకా శరత్ సినిమా చూసి మౌనంగా ఉండిపోయిన ప్రేక్షకులు మెల్లమెల్లగా ఆ ఆశ్చర్యం లోంచి తేరుకుని మాట్లాడడం మొదలుపెట్టారు.

ఆ సినిమా చూసి అచ్చెరువొందిన మేధావులు, విమర్శకులు సైతం తమ అభిప్రాయాలు వెలిబుచ్చసాగారు. మీటింగులు పెట్టి మరీ ఆ సినిమా గురించి చర్చించసాగారు.

ఎక్కడ విన్నా ఒకే మాట 'భారతీయ సినిమా చరిత్రలోనే ఇలాంటి సినిమాని ఇప్పటిదాకా చూడలేదు. తెలుగు సినిమా గతిని మార్చి కనీసం ఒక దశాబ్దం పాటు దిశానిర్దేశకంగా నిలబడబోయే సినిమా ఇది'

మొదటి వారంరోజులూ అరాకొరా కలెక్షన్లతో ఆడిన సినిమాకి ఇప్పుడు వెల్లువలా జన ప్రవాహం మొదలైంది.

రోజుకి ఐదారు షోలు వేసినా సరిపడినంత మంది జనం.

ఒక నిశ్శబ్ద విప్లవంలా ఆంధ్ర ప్రేక్షక లోకాన్ని ముంచెత్తింది శరత్ సినిమా.

జరుగుతున్న ఈ పరిణామాలన్నీ రామచంద్రం మనోస్థైర్యాన్ని దెబ్బ తీసాయి. ఈ సినిమాతో ఇంటికెళ్లిపోతాడనుకున్న శరత్‌కి అందుకు

వ్యతిరేకంగా అనూహ్యమైన ఖ్యాతి రావడంతో తను తట్టుకోలేకపోతున్నాడు.

అతని వెలుగు ముందు తను క్రమంగా చీకట్లోకి వెళ్లిపోతున్నట్లు అనిపిస్తోంది. పత్రికల్లోనూ, పేపర్ల లోనూ కనిపిస్తున్న అతని ఫొటోలు తనని చూసి వెక్కిరిస్తూ నవ్వుతున్నట్లు అనిపిస్తున్నాయి.

ఎవరీ శరత్? ఒకప్పుడు తనేం చెబితే అదీ రాసి, తనేం చెబితే అది తీసి, తను కూర్చుంటే తన వెన కాల నిలబడే తన అసిస్టెంటే కదా?

అంతలోనే ఇంతగా ఎలా ఎదిగిపోయాడు?

ఇప్పుడతని ముందు తను ఫేడవుట్ అయిపో వాల్సిందేనా?

రామచంద్రానికి గుండెల్లో దడ, కాళ్లల్లో ఒణుకు మొదలయ్యాయి.

ఆ తరువాత ఒక వారం రోజులు ఏ కారణం లేకుండానే అతని సినిమా షూటింగ్‌లు వాయిదా పడ్డాయి.

★★★

శరత్ సినిమాకి వస్తున్న పేరు ప్రతిష్ఠలు రోజు రోజుకీ ఎక్కువైపోతున్నాయి.

ఎక్కడ చూసినా అతనికి సన్మానాలు, అభినం దన సభలూ! రామచంద్రం సినిమా షూటింగ్ మళ్లీ మొదలైందికానీ మునుపటి ఉత్సాహంలేదు. మంద కొడిగా సాగుతోంది.

చేతిలో విస్కీ గ్లాసులేందే పనిచేయలేకపోతు న్నాడు.

అంతా అసిస్టెంట్లకే అప్పచెప్పేస్తున్నాడు.

ఒక్కోసారి షూటింగ్ స్పాట్‌కి కూడా రావడం మానేసాడు.

నిర్మాతలతో అతనికున్న పరిచయంవల్ల, అంతకుముందున్న పేరువల్ల, అందరికీ అతని తత్వం తెలిసినదే అవడంవల్ల ఎవరూ దాన్ని పెద్దగా పట్టించుకోలేదు.



"సార్! ఈ సీన్‌కి కొంచెం షాట్ డివిజన్ చెప్తారా?'' అసిస్టెంటు అడిగాడు రామచంద్రాన్ని.

చేతిలోని విస్కీగ్లాసు పక్కనపెట్టి స్క్రిప్టు కాగితాలు అందుకున్నాడు. మెదడు పనిచేయడంలేదు. స్క్రిప్టులోని అక్షరాలన్నీ అలికేసినట్టుగా కనిపిస్తున్నాయి. ఆ అక్షరాల మధ్య నుంచి తనని వెక్కిరిస్తూ నవ్వుతున్న శరత్ ముఖం.

ఉలిక్కిపడ్డాడు రామచంద్రం.

ఏడాది తిరక్కుండానే శరత్‌ని ఇంటికి పంపివేస్తాననీ, అతనికి ఇండస్ట్రీలో స్థానం లేకుండా చేస్తాననీ బహిరంగంగానే తను ఎన్నోసార్లు వ్యాఖ్యానాలు చేశాడు.

కానీ ఇప్పుడేమయింది?


విస్కీ గ్లాసు ఎత్తి దించకుండా గడగడా మొత్తం తాగేసాడు కసిగా.

ఒక్కసారి తల విదిల్చి మళ్లీ స్క్రిప్టు వంక చూసాడు.



## డైలమా

అందాలభామ భూమికచావ్లా ఇప్పుడు డైలమాలో పడిపోయింది. భూమికని కాదని ఓ సినిమా అవకాశం ఆయేషాటకియాకి బదిలీ కావడమే ఇందుకు కారణం. ఇంతియాజ్ అలీ కొత్తచిత్రంలో నటించే అవకాశం ఆమెని వెతుక్కుంటూ వచ్చింది. అయితే ఆమెకి టైం లేక దాన్ని తిరస్కరించింది. ఇప్పుడీమె స్థానంలో ఆయేషాటకియా నటిస్తోంది. దీంతో ఈభామకి ఇప్పుడు ఒక్క హిందీ సినిమా కూడా అందుబాటులో లేదు. కాలం కలిసొస్తే రెండుమూడు సినిమాల్లో నటించే అవకాశం రావచ్చుంటోంది.




మెదడు మొద్దుబారిపోయినట్లుగా ఒక్క ఆలోచన కూడా రావడంలేదు.

'నో' అని గట్టిగా అరుస్తూ తన ముందున్న టీపాయ్‌ని బలంగా తన్నాలన్నంత కసిగా అనిపించింది.

అది షూటింగ్ స్పాట్ అన్న స్పృహ ఇంకా ఉండడంవల్ల నిగ్రహించుకుంటూ స్క్రిప్టుని అసిస్టెంట్‌కి ఇచ్చేసాడు.

"షాట్ డివిజన్ నువ్వే చేసెయ్. ఏమైనా కరెక్షన్స్ ఉంటే చెప్తాను'' అనేసి అక్కడ్నుంచి లేచి వెళ్లిపోయాడు.

లాభంలేదు. ఈ బాధ భరించలేనట్టుగా ఉంది.

ఏదో ఒక రకంగా శరత్‌ని చావు దెబ్బ తీస్తేగానీ తన మనసుకి స్వాంతన కలిగేలా లేదు.

అతని పతనం చూస్తేగానీ తను మామూలు మనిషి కాలేడు.

కానీ ఎలా?

బాగా ఆలోచించాడు రాత్రంతా తాగుతూ.

ఈసారి అతడు మెదడు చురుగ్గా పనిచేసింది. మంచి పథకం తట్టింది. దొడ్డిదారే.

కానీ తప్పదు.

ఇప్పుడంతకన్నా మార్గంలేదు.

***

తన పథకం చెప్పి ఒప్పించడంకోసం ప్రస్తుతం నెంబర్‌వన్‌గా చెలామణీ అవుతున్న హీరోకి ఫోన్ చేసాడు రామచంద్ర.

తనని హీరోగా నిలబెట్టిన వ్యక్తిగా అతనికి రామచంద్రం అంటే ఎంతో అభిమానం.

అతనేం చెప్పినా కాదనకుండా చేస్తాడు. ఆ నమ్మకంతోనే ఫోన్ చేసాడతనికి రామచంద్రం.

"సారీ రామచంద్రం...శరత్ సినిమా ఇంతగా హిట్ అవుతుందని ఊహించలేదు'' ఫోనెత్తగానే అన్నాడతను.

శరత్ సినిమా ఫెయిలయిందని రామచంద్రం ఇచ్చిన పార్టీకి వచ్చినవాళ్లల్లో అతను కూడా ఉన్నాడు.

రామచంద్రం అతని మాటలు వినిపించుకోలేదు.

శరత్‌ని దెబ్బ తీయడానికి తను వేసిన పథకాన్ని మెల్లగా చెప్పసాగాడతనికి.

ఎవరికీ తెలియకూడని అతి రహస్యాన్ని జాగ్రత్తగా వివరిస్తూ చెప్పాడు.

తన తరువాత సినిమాకి కాల్షీట్లు ఇవ్వడానికి ఒప్పుకుంటూ ఆ హీరో శరత్‌ని పిలుస్తాడు.

అంతటి గొప్ప అవకాశాన్ని శరత్ కూడా జారవిడుచుకోలేడు కనుక ఒప్పుకుంటాడు.

అదే అతని పతనానికి మొదటి మెట్టవుతుంది.

కథా చర్చల దగ్గరనుంచీ, ప్రతి చిన్న విషయంలోనూ ఎవరికీ తెలియకుండా తను చెప్పినట్లు ఆడుతూ వేలు పెడుతూ చెడగొడుతూ ఉంటాడు హీరో.

ఈలోగా శరత్‌ని వేరే సినిమా చేసుకోనివ్వకుండా, ఈ సినిమా పూర్తి కాకుండా కొన్నాళ్ళు లాగుతారు.

ఒకవేళ తరువాత సినిమా విడుదలైనా అభిమానులు డైరెక్టర్ని చెప్పిచ్చుకుని కొట్టేంతలా చెడగొట్టడానికి కావాల్సిన అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. అటు వేరే సినిమాలు లేక వున్న ఒక్క సినిమా ఫెయిలయి ఇంటికెళ్లిపోతాడు శరత్.

ఈ పథకంవల్ల మహా అయితే ఆ హీరో ఒక సినిమా హిట్‌ని నష్టపోతాడు. దానికి తగ్గ ప్రతిఫలం అతనికి రామచంద్రం నుండి ముడుతుంది. ఇదీ పథకం.

"ఓకే డన్..." అన్నాడా హీరో రామచంద్రం చెప్పినదంతా విని.

"థాంక్యూ" అని ఫోన్ పెట్టేసాడు రామచంద్రం.

కొంత ఉపశమనంలా అనిపించినా మనసులో ఇంకా ఏదో ఇబ్బంది.

ఎదురుగా టేబుల్ మీద ప్రస్తుతం తను తీస్తున్న సినిమా తాలూకు స్క్రిప్టు ఉన్న ఫైలు కనబడింది.

అసంకల్పితంగా దాన్ని చేతిలోకి తీసుకుని తిరగేయసాగాడు.

చక్కటి పాయింటు చుట్టూ అల్లిన అద్భుతమైన కథ అది. స్క్రీన్‌ప్లే విషయంలో కూడా తన అనుభవాన్నంతా రంగరించి ఎంతో జాగ్రత్తగా మలిచాడు.

అసలా సినిమాని తను అనుకున్నది అనుకున్నట్లుగా తీయగలిగితే తనిలా శరత్‌ని దొంగదెబ్బ తీయడానికి పక్కదారులు పట్టాల్సిన అవసరమేలేదు.

కానీ ఎంత ప్రయత్నించినా తనకి సినిమా గురించి ఆలోచించడానికి ఏకాగ్రత కుదరడంలేదు.

ఎందుకిలా తయారవుతున్నాడు తను?

చేతిలోని ఫైల్‌ని పక్కన పడేసి రిమోట్‌తో టీవీ ఆన్ చేసాడు.

ఏదో ఛానల్‌లో శరత్ ఇంటర్‌వ్యూ వస్తోంది.

ఇంటర్‌వ్యూ చేస్తున్న యాంకర్ శరత్‌ని విపరీతంగా పొగిడేస్తోంది. శరత్ చిరునవ్వులు చిందిస్తున్నాడు.

రామచంద్రం దవడ కండరం బిగుసుకుంది.

అతని చేతులు విస్కీ గ్లాసు కోసం వెదికాయి. కసిగా విస్కీ చప్పరిస్తూ టీవీలోని శరత్‌ను మింగేసేలా చూడసాగాడు.

"చివరగా...ఇండస్ట్రీలో మీకూ, రామచంద్రంగారికీ మధ్యనున్న శత్రుత్వం గురించి..." సెన్సేషన్ క్రియేట్ చేయడానికన్నట్లు నెమ్మదిగా అడిగింది యాంకర్.

రామచంద్రం ఉలిక్కిపడ్డాడు.

శరత్ మాత్రం ఏమాత్రం తడబడకుండా చిన్నగా నవ్వాడు.

అతనేం సమాధానం చెబుతాడా అని రామచంద్రం ఆతృతగా కుర్చీలోంచి ముందుకు వంగాడు.

"రామచంద్రంగారిని శత్రువని నేనెప్పుడూ అనుకోలేదు. ఒకప్పుడు నేనాయన దగ్గర పనిచేసాను. అదే గౌరవభావం నాకింకా ఉంది. అయితే ఇటీవల ఆయన చేస్తున్న వ్యాఖ్యలనిబట్టి చూస్తే ఆయన నన్ను శత్రువుగా భావిస్తున్నారని తెలుస్తోంది. ఒకవేళ అదే నిజమైతే ఆ విషయం గురించి ఆలోచించి, మాట్లాడి నేను టైమ్ వేస్ట్ చేసుకోను. దాని ఆలోచించడంకన్నా నేను తీయబోయే తరువాతి సినిమా గురించి ఆలోచించడం నాకెక్కువ సంతృప్తినిస్తుంది"

అతని సమాధానాన్ని ఆశ్చర్యంగా విన్నాడు రామచంద్రం.

"బహుశా అదే మీ విజయ రహస్యమేమో" అలవాటు ప్రకారం నవ్వింది ఇంటర్‌వ్యూ చేస్తున్న యాంకర్.

ఆమె మాటలూ, ఆమె నవ్వు చాచి పెట్టి చెంప మీద కొట్టినట్లు అనిపించింది రామచంద్రానికి.

జ్ఞాన చక్షువులు మెల్లగా తెరుచుకుంటున్నట్లు అనిపించింది.

ఇన్నాళ్లూ తను శరత్‌ని తన శత్రువని అనుకుంటున్నాడు.

నిజానికి తన శత్రువు శరత్ కాదు.

శరత్ మీద తన మనసులో వున్న జెలసీ, శత్రుత్వమే తన శత్రువు. అవే ఇన్నాళ్లూ తనని నిలవనీయకుండా చేసి ఆడిస్తున్నాయి.

వాటిని జయించగలిగితే తను మామూలు మనిషవుతాడు. తను కూడా శరత్‌లా హిట్లు ఇవ్వగలుగుతాడు.

ఆ విషయాన్ని శరత్ ఎంత చక్కగా చెప్పాడు.

ఇన్నాళ్లూ తను తీయబోయే సినిమా గురించికన్నా శరత్‌ను ఎలా దెబ్బతీయాలా అన్న విషయం గురించే ఎక్కువ ఆలోచిస్తూ ఎంత ఫూల్‌లా ప్రవర్తించాడో తల్చుకుంటే సిగ్గేసింది.

ఆ రాత్రి రామచంద్రం ప్రశాంతంగా నిద్రపోయాడు.

***

మర్నాడు ఉదయమే ఆ హీరోకి ఫోన్ చేసి తన ప్రతిపాదన విరమించుకుంటున్నట్లు చెప్పి మరో మాట మాట్లాడకుండా ఫోన్ పెట్టేసాడు.

చాలా ఆనందంగా అనిపించింది.

షూటింగ్‌కు బయలుదేరుతుంటే మళ్లీ తన మొదటి సినిమా షూటింగ్‌కి వెళ్తున్నట్లనిపించింది రామచంద్రానికి.

★

## ఆసియాలో ఎత్తయిన భవనం

దక్షిణ కొరియాలోని సియోల్‌లో యోయిడా తూర్పు భాగాన ఆసియా అంతటిలోకి మిక్కిలి ఎత్తయిన భవనంగా నిర్మించబడిన డేహ్వాక్ ఇన్సూరెన్స్ బిల్డింగ్ తూర్పుభాగం 1983 నవంబర్ నెలలో పూర్తి చేయబడింది. అరవై అంతస్థులతో సముద్ర మట్టానికి 2500 మీటర్ల ఎత్తులో ఉండే ఈ భవనం అత్యంత గొప్పదిగా పేర్కొనబడింది.

## ఏనుగు దంతాలు

1900వ సంవత్సరం వరకు ప్రపంచంలో వాడుక చేయబడిన దంతాలన్నీ చరిత్ర పూర్వ యుగంనాటి ఏనుగుల శిలాస్థుల నుంచి లభించినవే. వీటిని సైబీరియా (రష్యా)లోని ఈశాన్య ప్రాంతం నుండి త్రవ్వి తీసారు.

## అంతరిక్ష పరిశోధన

సోవియెట్ యూనియన్ మొట్టమొదటి మానవ నిర్మితమైన భూ ఉపగ్రహం స్పుట్నిక్‌ను 1957 సంవత్సరం అక్టోబర్ 4వ తేదీన అంతరిక్షంలోకి ప్రవేశపెట్టినప్పుడు అంతరిక్ష పరిశోధనలో నూతన శకం ప్రారంభమయింది.

-రాంబాబు

